వైఎస్ఆర్
కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 22 మార్చి 2026

## రాయవరం ఓ ఇంట్లో చోరీ బంగారు డబ్బులు ఆస్తుల పత్రాలు అపహరణ



**సుండుపల్లి, మార్చి 21,ప్రభాతవార్త :** మండలం రాయవరం కస్పా లో 19వ తేదీ ఉగాది రాత్రి ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు,పగలగొట్టి ఇంటిలోకి చొరబడి గుర్తు తెలియని దుండగులు. బీరువా తాళాలు , వాకిళ్ల ను పగలగొట్టి బంగారు ఆభరణాలు , డబ్బులు,విలువైన ఆస్తి పత్రాలను అపహరించినట్లు బాధితులు తెలిపారు. స్థానికులతో సమాచారం తెలుసుకున్న బాధితులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై హుస్సేన్ సిబ్బందితో పరిశీలించినట్లు తెలియజేశారు. చోరీపై ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

## రాష్ట్ర ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు

### ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**చిన్నమండెం మార్చి 21 ప్రభాతవార్త:** శనివారం ఉదయం మండలంలోని బోరెడ్డిగారిపల్లిలో మంత్రి స్వగృహం నందు జిల్లా నలుమూలల నుండి వచ్చిన అధికారులు ప్రజలతో ప్రజా దర్బార్ నిర్వహించారు .రాష్ట్ర రవాణా యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర లోని ముస్లీం సోదర సోదరిమనులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ప్రజల సమస్యలు,అభ్యర్థనలు, వినతులు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజలకు అందుబాటులో ఉండి,సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని మంత్రి గారు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు కలిసి తమ సమస్యలను వివరించగా, వాటిని పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కొంతమంది అధికారులు ప్రజలు దుశ్యాలువ పుష్పగుచ్చములతో మంత్రి గారిని సత్కరించినారు.

## దివ్య సుగుణాల పరిమళభరిత సారమే..

# ఈద్ ఉల్ ఫితర్



**కడప కార్పొరేషన్ మార్చి 21 ప్రభాతవార్త:** కడప నగరంలోని బిల్టప్ సర్కిల్ లోని అమీనియా ఈద్గాలో పెద్దదర్గా పీఠాధిపతులు హజరత్ సయ్యద్ షా అరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో రంజాన్ పర్వదిన ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కాగా.. సంతోషం నిండిన వదనాలు, చిరునవ్వుల పలకరింపులు.. మనసును ఉల్లాస పరిచే అత్తరు పరిమళాలు ముస్లిం సోదరుల మధ్య పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేశాయి. అలింగన దృశ్యాలు సోదర, స్నేహ భావానికి ప్రతీకలుగా దర్శనమిచ్చాయి. రంజాన్ ప్రార్థనలు ముగిసిన అనంతరం మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు ఎస్.బి.అంజాద్ బాషా, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఎస్.అమీర్ బాబు లు వేరువేరుగా మాట్లాడుతూ తెలిసో తెలియకో ఏడాదిపాటు చేసిన తప్పు లను సమూలంగా కడిగేసే అవకాశం పవిత్రమైన రంజాన్ మాసంలో లభిస్తుందన్నారు. ఈ సృష్టి ధనదాన్యాలు, ఇతర సౌకర్యాలు అన్నీ దైవం ఇచ్చేనవేనని, భూమిపై మనదంటూ ఏమీ ఉండదని, కానీ మనిషి అజ్ఞానంతో అన్నీ తానే సాధించినట్లు భ్రమ పడుతున్నాడని.. వాటిలో ఏ ఒక్కటి తిరిగి తీసుకు వెళ్లలేదని తెలుసుకోవాలన్నారు. అల్లా ఆజ్ఞ ప్రకారం ప్రతి ఒక్కరూ తన సంపాదనలో రెండున్నర శాతం జకాత్ రూపంలో పేదలకు ఖర్చు చేయడం ఈ రంజాన్ మాసంలో చేసే పవిత్ర పుణ్యకార్యం అన్నారు. అందుకే ప్రతి మనిషి తనకు ఉన్నంతలో తోటి మనిషికి సాయం అందించే స్వభావాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రపంచమంతటా శాంతియుతంగా ఉండేలా ఆ అల్లాహ్ కృప యావత్ ప్రాణికీ అందాలని.. దేశం, రాష్ట్రం, జిల్లా, కడప నగరం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మత గురువులు (మోల్వి) ముఫ్తి న్యామతుల్లా సాహెబ్, దర్గా అమీర్, సీనియర్ నాయకులు సుభాన్ బాషా, మాజీ కార్పొరేటర్లు మహమ్మద్ షఫీ, అజ్మతుల్లా ఖాన్, వివిధ పార్టీల నాయకులు నజీర్ అహ్మద్, అమీర్ బాబు, అఫ్జల్ ఖాన్, వైవియు రిజిస్టర్ గులాం తారిక్, మేధావుల విభాగం నగర అధ్యక్షుడు డాక్టర్ అస్గర్ అలీ, నగర కార్యదర్శి మాస్టర్ అహ్మద్, ఇస్మాయిల్,బన్న ఇతర మైనారిటీ, స్థానిక నాయకులు, ముస్లిం మత పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు హాజరయ్యారు.

## ఆంజనేయ స్వామి కరుణా కటాక్షంతో ప్రజలు

# సుఖశాంతులతో వర్ధిల్లాలి

### మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి



**రాయచోటి మార్చి 21 ప్రభాతవార్త :** శ్రీ ఆంజనేయస్వామి కరుణాకటాక్షం తో ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని రాష్ట్ర రవాణా యుజన క్రీడా శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆయన, ఆయన తనయుడు నిచ్చల్ నాగిరెడ్డి ఈరోజు అన్నమయ్య జిల్లా రాయ చోటి మండలంలోని అబ్బ వరం గ్రామంలో ఉన్నటు వంటి శ్రీ అభయాంజనేయ స్వామి వార్షిక తిరుణాల మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు.వీరికి ఆలయ కమిటీ సభ్యులు,దేవస్థానం అధికారులు,టిడిపి నేతలు తో పాటు అర్చకులు పూర్ణ కుంబంతో స్వాగతం పలికారు.అనంతరం స్వామి వారికి వారిచే ప్రత్యేక పూజలు గావించి వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు.అనంతరం శాలువాతో సత్కరించి గజమాలతో సన్మానించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీ అభయాంజనేయ స్వామి వారిని భక్తితో పూజించిన వారికి సకల సౌభాగ్యాలు ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తులు ప్రగడ నమ్మకం అన్నారు.అనంతరం కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని మంత్రి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు పవిత్రమైన రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మైనార్టీ సోదరా సోదరీమణులు ఇచ్చినటువంటి విందులో కూడా పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాయచోటి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండికోట సుధాకర్, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదు

### గ్యాస్ సరఫరాపై అపోహలు నమ్మద్దు, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ



**మదనపల్లె, మార్చి 21 ప్రభాతవార్త :** అన్నమయ్య జిల్లాలో ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, గ్యాస్ సరఫరాపై అపోహాలు నమ్మ వద్దంటూ జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ తెలిపారు. శనివారం మదనపల్లె కలెక్టరేట్‌లోని పిజిఆర్ ఎస్ హాలులో జిల్లాలో పనిచేస్తున్న గ్యాస్ ఏజన్సీలు, డిస్ట్రిబ్యూటర్లతో గ్యాస్ సిలిండర్ల సరఫరా, నిల్వలు, డెలవరీ విధానంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ సరఫరాపై సామాజిక మాద్యమాల్లో వ్యాప్తి చెందుతున్న కొన్ని ఆపోహాలకు ఎలాంటి వాస్త వం లేదన్నారు. జిల్లాలోని 31 గ్యాస్ ఏజెన్సీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. సంబంధిత డివిజనల్ స్థాయి అధికారులు పర్యవేక్షణ అధికారులుగా ఉంటారన్నారు. అదే విధంగా జిల్లా, డివిజనల్ స్థాయిల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి ప్రజలకు స్పందన అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఫోన్‌నెంబర్ 08571-293001 ద్వారా గ్యాస్ సమస్యలను పరిష్కరించుకోవచ్చు నన్నారు. ఎల్‌పిజి గ్యాస్ సరఫరాలో సమస్యలపై ఫోన్‌నెంబర్లను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అసత్య ప్రచారాలు నమ్మి వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలోని ప్రభు త్వ పాఠశాలలు, హాస్టళ్ళు, సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ ఆసుపత్రులకు గ్యాస్ కొరత లేకుండా అవసరమైన సిలిండర్ల సరఫరాను చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ సుమతి, తూనికల కొలతల అధికారి దివ్య, సిఎస్ డిటిలు, డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

## రైళ్లు దూసుకెళ్తున్నాయి..

# నందలూరు ఎదురుచూస్తోంది

### ప్రధాన మార్గంలో ఉన్నా స్టాపింగ్ లేని దుస్థితి.. అభివృద్ధి ప్రయోజనం ఎవరికి?



**నందలూరు, మార్చి 21 ప్రభాత వార్త:** నందలూరు రైల్వే స్టేషన్ పరిస్థితి, అభివృద్ధి అనే పదానికి అర్థాన్ని ప్రశ్నించేలా మారింది. వేగవంతమైన రైళ్లు, ఆధునిక సాంకేతికత పెరిగినా, ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు అందకపోతే ఆ అభివృద్ధి అసంపూర్తిగానే మిగులుతుంది. చెన్నై-ముంబై ప్రధాన రైలుమార్గంలో ఉన్న నందలూరు స్టేషన్, ఒకప్పుడు ప్రత్యేక ప్రాధాన్యం పొందింది. బ్రిటిష్ కాలం నుంచే లోకో స్టీమ్ షెడ్‌తో వేలాది ఉద్యోగులతో కిటకిటలాడిన ఈ ప్రాంతం, స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఆధారంగా నిలిచింది. అయితే కాలానుగుణ మార్పులతో స్టీమ్, డీజిల్ ఇంజన్లు కనుమరుగై, ఎలక్ట్రిక్ రైళ్ల వేగం పెరిగిన కొద్దీ ఈ స్టేషన్ ప్రాముఖ్యత క్రమంగా తగ్గిపోయింది.

**ప్రధాన మార్గంలో ఉన్నా.. స్టాపింగ్ లేని స్టేషన్‌గా నందలూరు"**

ప్రస్తుతం పరిస్థితి మరింత ఆందోళనకరం. హైదరాబాద్, చెన్నై వంటి ప్రధాన నగరాలకు వెళ్లాలంటే నందలూరు ప్రజలు సమీప పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు రోజువారీగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**వేగం పెరిగింది.. కానీ ప్రజల ప్రయాణం కష్టమైంది"**

రైల్వే ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బంది కూడా ట్రైన్ స్టాపింగ్‌లు లేకపోవడంతో ప్రయాణం చేయలేకపోవడం విచారకరం. ఫ్రీ పాస్‌లు ఉన్నా ఉపయోగం లేకపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

**ఫ్రీ పాస్ ఉన్నా ప్రయాణం చేయలేని రిటైర్డ్ ఉద్యోగుల వేదన"**

ఇంకా స్టేషన్ పరిధిలో పలు రైల్వే విభాగాలు కొనసాగుతుండటం ఒక వైపు ఉంటే, మరోవైపు రైళ్లు ఆగకపోవడం వ్యతిరేక దృశ్యాన్ని చూపిస్తోంది. ఇది ప్రణాళికలో సమన్వయం లోపాన్ని స్పష్టంగా తెలియజేసోంది.

**స్టీమ్ యుగం స్వర్ణ కాలం.. ఇప్పుడు నిలక్ష్యం మాత్రమే"**

నందలూరులో విస్తారంగా ఉన్న రైల్వే భూములు నిరుపయోగంగా ఉండటం కూడా గమనించదగిన అంశం. ఈ భూములను రైల్ ల్యాండ్ డెవలప్మెంట్ అథారిటీ ద్వారా అభివృద్ధి చేస్తే ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, ప్రాంతీయ అభివృద్ధికి దోహదం చేస్తుంది. అలాగే, ఇక్కడ లభించే స్వచ్ఛమైన నీటి వనరులను వినియోగించి వాటర్ ఫిల్లింగ్ సదుపాయం కల్పిస్తే స్టేషన్ ప్రాధాన్యం మళ్లీ పెరుగుతుంది. నందలూరులో రైళ్లు ఆగకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నాం. చిన్న పనికైనా ఇతర స్టేషన్లకు వెళ్లాల్సి వస్తోంది."


వార్త 4వ పేజీలో

అట్టహాసంగా ప్రారంభమైన పెద్దమ్మ, చిన్నమ్మల జాతర

## మతసామరస్యానికి ప్రతీక

### ముస్లింల ప్రార్థనల్లో శిశిర



**మదనపల్లె, మార్చి 21 ప్రభాతవార్త :** మత సామరస్యానికి ప్రతీకగా, నిలిచే రంజాన్ పండుగకు ప్రతీకగా నిలిచింది. రంజాన్ పండగ రోజు ముస్లిం సోదరులు ప్రార్థనల్లో పాల్గొనడం సహాజం. రంజాన్ పండగ రోజు త్యాగరాజవీధికి చెందిన రామక్కగారి శిశిర ఉదయమే లేచి తలంటిస్నానం చేసి ఉదయం 8.30గంటలకు మసీదు దగ్గరలో ఉండడంతో మసీదులో చదివే ప్రార్థనలు ఆదారంగా ఉదయానే ఈ విద్యార్థిని అల్లాహుఅక్బర్ అంటూ ముస్లింల ప్రార్థన నిర్వహించింది. ఈ విద్యార్థి శ్రీచైతన్య టెక్నోస్కూల్ విద్యార్థిని. ఈ విద్యార్థి ప్రతి ఏడాది రంజాన్ పండగకేకాకుండా, క్రిస్మస్ రోజున కూడా ప్రార్థనలు చేయడం విశేషం. దీంతో వీధిలోని పలువరు భక్తిపై ఉన్న విశ్వాసాన్ని కొనియాడారు.

# గంటల వ్యవధిలో ఉపాధి కార్డు

### 100 రోజులుగా ఉన్న పని దినములు 125 రోజులకు పెంచింది



**పీలేరు మార్చి 21 ప్రభాతవార్త:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో విక సిత్ భారత్ గ్యారెంటీ ఫర్ గ్రామీణ్ రోజ్గర్ అండ్ అజీవికా మిషన్ (వీబీజీరామ్జీ)ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఏప్రిల్ 1 నుంచి నూతన పథకం అమల్లోకి రానుంది. నూతన పథకంలో కొన్ని మార్పులను చేసింది. ఏడాదిలో కుటుంబానికి 100 రోజుల పని దినాల స్థానంలో 125 రోజులకు పెంచింది. ఇకపై నిర్ణీత సమయానికి వేతనాల చెల్లింపులకు నిర్ణయం తీసుకుంది. గడువు లోపు వేతనాలు చెల్లించకుంటే శ్రామికులకు పరిహారం అందించేలా పథకంలో నిబంధనలు చేర్చారు. వీబీ జీ రామ్ లో పనులు చేయలంటే ముందుగా ఉపాధి కార్డును పొందే ప్రక్రియను సులభతరం చేసింది. ఉపాధి కార్డు కోసం దరఖాస్తు చేసిన 48 గంటల వ్యవధిలోనే అధికారులు జారీ చేయనున్నారు. బినామీలు ఉపాధి కార్డులు పొందకుండా చూసేందుకు ఈకేవైసీని అమల్లోకి తీసుకొచ్చింది. రెండు, మూడు చోట్ల పేర్లు నమోదు చేసుకోవడం, ఒకరికి బదులు మరొకరు పనులు చేయడం.. పనులకు రాని వారి పేర్లపై మాస్టర్లు వేయడం వంటి అక్రమాలకు సాంకేతిక పరిజ్ఞానంతో అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకుంటారు. జిల్లాలో ప్రస్తుతం 1,77,267 జాబ్ కార్డులు కలిగి ఉన్నారు. 2.90 లక్షల మంది ఉపాధి పనులకు వస్తున్నారు. ఆధార్ కార్డుతో నేరుగా గ్రామాల్లోని ఉపాధి హామీ క్షేత్ర సహా యకుడిని కలిస్తే ఈకేవైసీ పూర్తి చేసి జాబ్ కార్డుకు దరఖాస్తు చేస్తారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు పరిశీలించి జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులకు అప్లోడ్ చేసిన తర్వాత.. వారు మరోసారి పరిశీలించి కార్డు జారీ చేస్తారు. ఈ కార్డు పొందిన వారికి మాత్రమే 2026, ఏప్రిల్ 1 నుంచి వీబీజీరామ్ జీ పనులు కేటాయిస్తారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి పిడి వెంకటరత్నం తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన

# గుర్తు తెలియని వ్యక్తి



**రాజంపేట, మార్చి 21 ప్రభాతవార్త** రాజంపేట బైపాస్ రోడ్ లో జీకేఎస్ఆర్ కళ్యాణ మండపం వద్ద గుర్తు తెలియనివాహనం ఢీకొని శనివారం తెల్లవారుజామునగుర్తుతెలియని వ్యక్తి మరణించినట్లు అర్బన్ పోలీసులు తెలిపారు. మధ్య హనీ రాజంపేట పోలీసులు స్వయంగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ చనిపోయిన వ్యక్తి వద్ద ఎటువంటి గుర్తింపు ఆధారాలు లేవు. ఈ వ్యక్తి ఊరు పేరు వివరములు తెలియదు. ఈ వ్యక్తి గురించి ఎటువంటి వివరాలు తెలిసినా రాజంపేట అర్బన్ పోలీసు స్టేషన్ కి సమాచారం తెలపాలని పోలీసులు కోరారు. సమాచారం కోసం రాజంపేట్ టౌన్ సిఐ 9121100569, రాజంపేట్ టౌన్ యస్ఐ 9121100570 మొబైల్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

# మానవ హితం ఈద్ పరమార్థం

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



పీలేరు మార్చి 21 ప్రభాతవార్త: నియోజకవర్గంలోని వాల్మీకిపురంలో మానవ హితమే ఈద్ పరమార్థమని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి ఆనందంగా జరుపుకునే రంజాన్ పండుగతో బంధాలు మరింత బలపడతాయన్నారు. ద్వేషం స్థానంలో ప్రేమను, స్వార్థం స్థానంలో దానాన్ని, భేషజాల స్థానంలో ఐకమత్యాన్ని పెంపొందించడమే ఖీఈద్ ఉల్ ఫితర్ఖీ పండుగ అసలు అర్థం అన్నారు. రంజాన్ పండుగతో ప్రపంచంలో శాంతి నెలకొనాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, మైనారిటీ నాయకులు అమీన్ పీర్, సమీ, అలీ అన్సర్, జబీవుల్లా, ఇంతియాజ్, ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రంజాన్ వేడుకలు



చిన్నమండెం మార్చి 21 ప్రభాతవార్త: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ముస్లిం సోదరులు శనివారం రంజాన్ పండగను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ముస్లిం సోదరులు చిన్నమండెం పెద్దమండెం మార్గం లో ఉన్న ఈద్గాలో సామూహికంగా ప్రార్థనలు నిర్వహించారు . నెల రోజుల పాటు భక్తి శ్రద్ధలతో కఠోర ఉపవాస దీక్షలు ఉండి నేడు భక్తి శ్రద్ధలతో , సంతోషాలుతో పండుగ జరుపుకున్నారు. నమాజ్ ప్రార్థనలలో వేలాది మంది పాల్గొన్నారు .ఈద్గాలో ప్రార్థనల సౌకర్యార్థం ఈద్గా వద్ద షామియానాలు ఏర్పాటు చేసారు. నమాజ్ ప్రార్థనల అనంతరం అక్కడ ఒక్కరికి ఒక్కరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పారు.అనంతరం బంధు మిత్రులతో కలసి తీపి మాంసాహారంతో విందు భోజనాలు చేశారు.పేదలకు దాన ధర్మాలు చేశారు. పోలీసులు బందో బస్తు ఏర్పాటు చేశారు.

## ఏపీ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లి మార్చి 21 ప్రభాతవార్త

లక్కిరెడ్డిపల్లి లోని ఏపీ మోడల్ కళాశాలలో 2026 27 విద్యా సంవత్సరం సంబంధించిన మొదటి ఇంటర్ సంవత్సరం ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వారాల రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు మార్చి 18 నుంచి ఏప్రిల్ 30 వరకు దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా చేసుకోవచ్చన్నారు పూర్తి అయిన దరఖాస్తులను ఏపీ మోడల్ స్కూల్లో అప్పగించాలన్నారు బాలికలకు వసతిగృహము కలదు టెన్త్ క్లాస్ మార్కులు జాబితా ప్రకారం ప్రవేశంలో అర్హత ఉంటుందన్నారు ఎంపీసీ బైపిసి సిఈసి ఎంఈసి గ్రూపుల్లో చేరవచ్చన్నారు ఈ అవకాశము 10వ తరగతి పబ్లిక్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు 15 రూపాయలు ఓసీబీసీ ఓబీసీ విద్యార్థులకు 200 రూపాయలు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## కురబలకోటలో భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు



కురబలకోట మార్చి 21 ప్రభాతవార్త

కురబలకోట మండలంలో రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఉదయం ముస్లిం సోదరులు నూతన వస్త్రాలు ధరించి మసీదుల వద్ద నుంచి తక్బీర్ పట్టిస్తూ ఈద్గాల వద్దకు చేరుకున్నారు. అక్కడ సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. దివ్య ఖురాన్, ఈద్‌ఉల్‌ఫితర్ ప్రాముఖ్యత, సందేశాలను గురించి హాజరతులు, ఆలం, మహమ్మద్ రఫీ లు తెలియజేశారు. అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కబరస్తాన్(సమాధులు) వద్దలకు వెళ్లి నివాళులర్పించారు. మండలంలోని కురబలకోట, అంగళ్లు, ముదివేడు,సర్కార్ తోపు, మొలక వారి పల్లి,భద్రయ్య గారి పల్లి, తెట్టు తదితర గ్రామాలు వద్ద ప్రత్యేక సామూహిక ప్రార్థనలు. నిర్వహించారు.

## తంబళ్లపల్లెలో ఘనంగా రంజాన్ వేడుకలు



తంబళ్లపల్లె మార్చి 21 ప్రభాతవార్త : తంబళ్లపల్లె మండలంలో ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉదయం తంబళ్లపల్లె పెద్ద మసీదుకు చెందిన ముస్లిం సోదరులు మసీదు నుండి ఖురాన్ ఆలాపిస్తూ క్రాస్ రోడ్లోని ఈద్గా వద్దకు చేరుకొని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ యూసుఫ్ రంజాన్ పండుగ పవిత్రత, మత ప్రవక్త సూక్తులు, విశేషాలను తెలియజేశారు. అనంతరం ముస్లిం సోదరులు పరస్పరం రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పేదలకు దానధర్మాలు నిర్వహించారు. మండలంలోని కోసువారిపల్లె, గోపి దిన్నె, కొటాల, గంగిరెడ్డిపల్లి, కుక్క రాజు పల్లి, ఎద్దుల వారి పల్లి మసీదులలో ముస్లిం సోదరులు రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

## ఘనంగా రంజాన్ వేడుకలు

ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లిం సోదరులు



ముద్దనూరు,మార్చి, 21, ప్రభాతవార్త : మండల పరిధిలోని ముస్లిం సోదరులు శనివారం ముస్లిం పెద్దల సూచనల మేరకు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం తాడిపత్రి జాతీయ రహదారి సమీపంలోని ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు ఒకరికి ఒకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొని మత పెద్దల ఆధ్వర్యంలో, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నెలరోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు దీక్షలు విరమించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం రంజాన్ మాసం ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ రంజాన్ మాసంలో దానధర్మాలు చేస్తే ఎంతో పుణ్యఫలం లభిస్తుందని వివరించారు. రంజాన్ వేడుకల సందర్భంగా సిఐ నగేష్ బాబు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సిఐ, ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తులో ప్రకృతి వ్యవసాయ రైతులే ఆరోగ్య ప్రధాతలు

గుండ్లపల్లి లో వికసించిన ప్రకృతి వ్యవసాయ ఫలాలుఫోర్డ్ సంస్థ అవగాహనే ఆదర్శం



తంబళ్లపల్లె మార్చి 21 ప్రభాతవార్త : రసాయన ఎరువులు, క్రిమిసంహారాలతో పండిన ఫల సాయంతో నేటి సమాజం ఆరోగ్యాలు క్షీణించి నిత్యం ఆసుపత్రుల పాలవుతున్న తరుణంలో ఎడారిలో ఒయాసిస్ లా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థల ప్రేరణతో ప్రకృతి వ్యవసాయ పంటల సాగు తంబళ్లపల్లెలో పురుడు పోసుకోవడం హర్షనీయం. తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లె పంచాయతీలో ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జె. లలితమ్మ ఏడాదిగా ప్రకృతి వ్యవసాయం పై స్థానిక రైతులకు రైతు యాత్రలు, అవగాహన సదస్సులు నిర్వహించి వారిలో చైతన్యం నింపి రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు నడవడానికి పునాదులు వేశారు. ఫోర్డ్ సంస్థ చేసిన ప్రయత్నం ఫలించి నేడు గుండ్లపల్లి పంచాయతీ లో పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయ పంటల ఫలాలతో సత్ఫలితాలు సాధించి విజయకేతనం ఎగరవేశారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సేంద్రియ ఎరువులు, పేడ ఎరువు, కషాయాలతో వేరుశనగ, మామిడి, మొక్కజొన్న, సుమారు 30 రకాల చిరుధాన్య పంటలు, ఆకుకూరలు, కూరగాయల పంటలు పండించడంతోపాటు అధిక దిగుబడి సాధించారు. ఇందులో భాగంగా శనివారం ఫోర్డ్ డైరెక్టర్ లలితమ్మ, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు గుండ్లపల్లి ప్రకృతి వ్యవసాయ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులను అభినందించారు. రైతు నరసింహులు వేసిన మామిడి, అంతర్ పంట వేరుశనగ ఎకరాకు 15 బస్తాల దిగుబడి వస్తుందని చెప్పడంతో ప్రకృతి వ్యవసాయంలో నైతిక విజయం సాధించి గుండ్లపల్లి రైతులు ఆదర్శంగా నిలిచినట్లు ఆమె కొనియాడారు. అదేవిధంగా మరో రైతు మనోహర్ తనకున్న కొద్దిపాటి పొలంలో 15 రకాల కూరగాయలు, ఆకుకూరలు పంటలు పండించి లబ్ధి పొందడం విశేషం. ప్రతి రైతు ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి సారిస్తే రైతుల పొలాలు భూసారం పెరిగి పండిన ఫల సాయం మానవాళికి ఆరోగ్యంతో పాటు పర్యావరణం పరిరక్షణ కలుగుతుందని వారికి హితబోధ చేశారు. ఆమె వెంట పోర్డు సంస్థ ప్రతినిధులు రమణ, హేమంత్, సంపూర్ణ, ఏపీ సీఎన్ ఎఫ్ ప్రతినిధులు రాజు, రెడ్డప్ప రైతులు పాల్గొన్నారు.

## మాధవరం కురవపల్లెలో రామాలయం నిర్మాణానికి నిధులు మంజూరు



రాయచోటి మార్చి 21 ప్రభాతవార్త

రాయచోటి మండల పరిధిలోని మాధవరం గ్రామం ఉరవపల్లెలో నూతన రామాలయం నిర్మాణానికి దేవాదాయ శాఖ ద్వారా రూ.42 లక్షలు నిధులు మంజూరయ్యాయి.గ్రామంలో పూర్వం పెద్దలు నిర్మించిన చిన్న గుడి శిథిలావస్థకు చేరుకొని దెబ్బ తినడంతో ఆస్థానంలో నూతన రామాలయం నిర్మించేందుకు మాధవరం గ్రామ టిడిపి నాయకులు,బీసీ నేత పుల్లగూర రామాంజులు ఆధ్వర్యంలో కురవపల్లి గ్రామస్తులు సమస్యను రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.కురవపల్లి గ్రామస్తుల వినతి మేరకు మంత్రి మండిపల్లి సమస్యను దేవాదాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి నూతన ఆలయ నిర్మాణానికి దేవాదాయ శాఖ ద్వారా రూ. 42 లక్షల నిధులు మంజూరుకు కృషి చేశారు.దీంతో కురవపల్లె గ్రామంలో త్వరలోనే నూతన రామాలయ నిర్మాణానికి పనులు చేపట్టనున్నారు. సమస్యను చెప్పిన వెంటనే స్పందించి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి,ఆయన సోదరులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, మేనల్లుడు మిన్నంరెడ్డి మోర్యారెడ్డిలకు కురవపల్లె గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మానవాళిలో హితాన్ని ప్రేరేపించేది రంజాన్



చౌడేపల్లి, మార్చి 21 ప్రభాతవార్త

మానవాళిలో హితాన్ని ఆకాంక్షించే రంజాన్ పండుగను మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మేదరదొడ్డి, సంతగేటుల జుమియా, షాకీర్ మసీదుల ముస్లిం సోదరులు ర్యాలీగా చెడుగుట్లపల్లి రోడ్డు వైపు వున్న ఈద్గా వద్దకు చేరుకొన్నారు. అక్కడ మత పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ తెలుపుకొన్నారు. అదే విధంగా దాదేపల్లి, ఖాన్‌సాబ్‌మిట్ట, బుటకపల్లి, ఎ.కొత్తకోట, కోటూరు, అంకుతోటపల్లి, మర్రిమాకులపల్లి, కాగతి, లద్దిగం తదితర గ్రామాల్లోనూ ముస్లిం సోదరులు ఈద్గా, మసీదుల్లో ప్రార్థనలు చేసారు. హిందూ-ముస్లింల సఖ్యతను చాటుతూ సహపంక్తి భోజనాలు చేసారు.

## జాతరలో మహిళపై అసభ్య ప్రవర్తన

ఆకతాయిలకు దేహశుద్ధి

మదనపల్లెక్రైమ్, మార్చి 21 ప్రభాతవార్త.

మదనపల్లె చౌడేశ్వరి అమ్మవారి జాతరలో కొందరు ఆకతాయిలు భర్త కళ్లముందే భార్య పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మదనపల్లెకు చెందిన మమత, ఆమె భర్త సురేష్‌తో కలిసి శుక్రవారం రాత్రి చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకోవడానికి జాతరకు వెళ్లారు. రాత్రి 11 గంటల సమయంలో దర్శనం ముగించుకుని వారు బైక్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో ఉన్న కొంతమంది ఆకతాయి యువకులు మమతను వెంబడించారు. ఆమె చుట్టూ తిరుగుతూ ఈలలు వేస్తూ, అసభ్యకరమైన సైగలు చేశారు. దీంతో భర్త సురేష్ వారిని అడ్డుకోగ అతని పై దాడి కి పాల్పడ్డారు. యువకుల ఆగడాలను గమనించిన స్థానికులు ఆకతాయిలకు దేహశుద్ధి చేశారు. జాతర బందోబస్తులో ఉన్న పోలీసులు సమాచారం అందుకున్న వెంటనే అక్కడికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితులను నాగరాజు నాయక్, రఘులుగా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మతసామరస్యంగా రంజాన్ వేడుకలు



రాయచోటి మార్చి 21 ప్రభాతవార్త : విత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులు మతసామ రస్యంగా రంజాన్ వేడుకలు నిర్వహించుకున్నందుకు రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు అభినందనలు తెలిపారు. తెలిపారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన ఈ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు, ప్రార్థనలు మనసును పవిత్రం చేసుకోవడానికి, మంచి మార్గంలో నడవడానికి, పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందించడానికి గొప్ప అవకాశం అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సభ్యులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కారు బైకు డి స్కూటర్ రీస్ట్‌కు తీవ్ర గాయాలు



సంబేపల్లి మార్చి 21 ప్రభాతవార్త కర్నూలు చిత్తూరు జాతీయ రహదారి లోని బుడ్డా రెడ్డిగారి పల్లె సమీపంలో శనివారం ద్విచక్ర వాహనం కారు ఢీకొనగ చిన్న చౌకు నాగబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు అరుణాచలం నుండి దైవదర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో సంబేపల్లి మండలం బుడ్డా రెడ్డి గారి పల్లె వద్దకు రాగా అడవి కంపల్లి గ్రామం పాలెంకట హరిజనవాడకు చెందిన నాగబాబు తన ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది ఈ ప్రమాదంలో నాగబాబుకు తీవ్ర గాయాల య్యాయి గాయపడ్డ నాగబాబును 108 లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గా ప్రార్థనల్లో పాల్గొన్న మండిపల్లి నిచ్చల్ నాగిరెడ్డి



రాయచోటి మార్చి 21 ప్రభాతవార్త : పవిత్రమైన రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కుమారుడు నిచ్చల్ నాగిరెడ్డి మైనారిటీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరలతో కలసి ప్రార్థనలు నిర్వహించి, వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పవిత్ర పర్వదినం సమాజంలో శాంతి, సౌహార్దత, ఐక్యతను మరింత బలోపేతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో, స్నేహభావంతో కలిసి జీవిం చాలనే సందేశాన్ని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్దలతో రంజాన్

గుర్రంకొండ, మార్చి 21, ప్రభాతవార్త

గుర్రంకొండలో ముస్లిం సోదరులు శనివారం రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుండీ మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేసుకొన్నారు. ఆప్త మిత్రులు ఒకరికొకరు ఆలింగనం చేసుకొంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. గుర్రంకొండ, తరిగొండ, చెర్లోపల్లె, సంగసముద్రం, మర్రిపాడు, శెట్టివారిపల్లిగ్రామాలలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేయడం జరిగింది.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పోరుమామిళ్ల రూరల్, మార్చి 21 ప్రభాతవార్త: పోరుమామిళ్ల పట్టణంలోని పొట్టి శ్రీరాములు వీధిలో నూతనంగా రూ. 9 లక్షలతో మంజూరైన సిసి రోడ్డు నిర్మాణ పనులను శనివారం బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు సీతా వెంకటసుబ్బయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు టెంకాయ కొట్టి నూతన రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం వారిని టిడిపి నాయకుడు గాలి మురళి ఆధ్వర్యంలో శాలువా పూలమాలతో సత్కరించారు. వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రతి వీధి సస్యశ్యామలంగా ఉండాలని ఉద్దేశంతో నూతన సీసీ రోడ్డులను మంజూరు చేసిందన్నారు. ప్రజాభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిహిమామ్ హుస్సేన్, గాలి మురళి, శంకర్ రెడ్డి, జనార్ధన్, ప్రొఫెసర్ భాష,మోలాలి, నాగరాజు శెట్టి, టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు, పాల్గొన్నారు.

## కలికిరిలో ఘనంగా రంజాన్ పండగ

కలికిరి, మార్చి 21, ప్రభాతవార్త: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో శనివారం రంజాన్ పండగను ముస్లిం మైనార్టీ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం ఉదయం తెల్లవారుజామునే ముస్లిం సోదరులు మసీదుల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పేదలకు దానధర్మాలు చేశారు. రంజాన్ పండగ సందర్భంగా అన్ని మసీదులను ఈద్గా మైదానాలను ప్రత్యేక అలంకరణలతో అలంకరించారు. పండగ సందర్భంగా ముస్లిం సోదరులు ఉపవాసాలతో ఉండి శనివారం ఈద్గా మైదానాలలో ప్రత్యేక ప్రార్థనలు జరుపుకున్నారు. ముస్లిం మత పెద్దలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కలికిరి సీఐ అనిల్‌కుమార్ తన సిబ్బందితో భారీ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తులో హెడ్‌కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్, విజయ్‌కుమార్, పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. దీంతో రంజాన్ పండగ ప్రశాంత వాతావరణంలో జరిగింది.

## రంజాన్ వేడుకలలో సర్పంచ్ చలపతి



మదనపల్లె, మార్చి 21 ప్రభాతవార్త.

అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి పట్టణంలో శనివారం రంజాన్ పర్వదిన వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ జరిగాయి.కొత్తిండ్లకు చెందిన బుల్లెట్ షఫీ ఆహ్వానం మేరకు వారినివాసంలో జరిగిన రంజాన్ పర్వదినానికి కురువంక సర్పంచ్ పసుపులేటి చలపతి హాజరయ్యారు.ఇందులో భాగంగా బుల్లెట్ షఫీకి మిఠాయిలు తినిపించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ చలపతి మాట్లాడుతూ ముస్లింలకు అతి పవిత్రమైన పర్వదినం రంజాన్ అని అన్నారు.సుమారు 30 రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు ఆచరించి అనంతరం ఈ పండుగను జరుపుకుంటారన్నారు .భారతదేశం సర్వమత సమ్మేళనమని,ముస్లింలకు రాజ్యాంగంలో అనేక హక్కులు కల్పించిందన్నారు.దేశ అభివృద్ధిలో ముస్లింలు తనదైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.మదనపల్లిలో హిందూ,ముస్లిం ఐక్యత వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు శివారెడ్డి,బివైస్ వ్యవస్థాపకులు పునీత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ



లక్కిరెడ్డిపల్లి మార్చి 21 ప్రభాతవార్త

మత సామరస్యానికి ప్రతీక అయినఈద్-ఉల్-ఫితర్(రంజాన్) వేడుకలను శనివారం ముస్లిం సోదరులు అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. మండలంలోని లక్కిరెడ్డిపల్లి టౌన్ రెడ్డివారిపల్లే ఈద్గా వద్ద వేసవి దృష్టిలో ఉంచుకొని ప్రార్థనలు కొరకు వచ్చే ముస్లిం సోదరుల కోసం ఎంపిపి సుదర్శన్ రెడ్డి క్షమియానా ను (చలువ పందిళ్లను) ఏర్పాటు చేయించ్చారు. చింతకుంటవాండ్లపల్లి, పెద్దపల్లి,దిన్నెపాడు, పందిళ్ళపల్లి,దప్పేపల్లి లోని మసీదులలో ముస్లింలు సోదరులు భక్తి శ్రద్ధలతో ఘనంగా ప్రార్థనలు నిర్వహించుకున్నారు నూతన దుస్తులు ధరించి చిన్నా పెద్దా కలుసుకొని ఈద్ ఉల్ పీతర్ తెలుపుకున్నారు .లక్కిరెడ్డిపల్లిలోని ఈద్గా మైదానంలో రంజాన్ ప్రార్థనల్లో ముస్లిం సోదరులు వందలాదిగా పాల్గొనీ ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు ప్రభుత్వ ఖ్వాజి అయిన ముక్తియార్ రంజాన్ విశిష్టత, మహమ్మద్ ప్రవక్త అల్లా అనుగ్రహంపై ప్రత్యేక సందేశమిచారు .రంజాన్ పర్వదినం పురస్కరించుకొని డబ్బులు, వస్త్ర దానాలు చేశారు. పరమత సహనం పాటించి అందరితో సోదరభావంగా మెలగాలని సూచించారు.ఆత్మ సంతృప్తితో అల్లాను ప్రార్థిస్తే కష్టాలన్ని తొలగి శుభం చేకూరుతుందని తెలిపారు. లక్కీరెడ్డిపల్లి ఏంపిపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి ఈద్గా వద్ద ముస్లిం సోదరులు మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, చాన్ బాషా , బాబ్జాన్, జాకీర్ లతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి సుదర్శన్ రెడ్డి ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ప్రార్థనల అనంతరం ముస్లింలు గతించిన తమ కుటుంబ సభ్యుల సమాధుల వద్ద నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు, పాల్గొన్నారు.

## 12 డివిజన్ పరిధిలో నూతన రోడ్లను నిర్మించాలి



కడప కార్పొరేషన్ మార్చి 21 ప్రభాతవార్త: కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12 వ డివిజన్‌లోని శ్రీనగర్ కాలనీ, ఎస్ కే డి ఆర్ కాలనీ, ఆర్టీసీ కాలనీ డ్రైనేజీలకు మరమ్మతులు చేయాలని, నూతన రోడ్లు నిర్మించాలని కడప జిల్లా బిజెపి అధ్యక్షులు జంగిటి వెంకటసుబ్బారెడ్డి కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులను కోరారు. ఈ మేరకు కడప నగరపాలక సంస్థ కమిషనర్ కూచిపూడి రాకేష్ చంద్రంను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ 12 డివిజన్ పరిధి మాత్రమే కాకుండా ఇతర డివిజన్ లలో పలు కాలనీలలో కూడా రోడ్లు డ్రైనేజీల వ్యవస్థ అధ్వానంగా ఉందన్నారు. 14 డివిజన్ ప్రకాష్ నగర్ పరిధిలో మురికి నీరు రోడ్ల పైన ప్రవహిస్తుందని విమర్శించారు. దీన్ని సరి చేయాలని అధికారం కోరారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు 12వ డివిజన్ ఇంచార్జ్ ఎర్రు మల్లికార్జున రెడ్డి, బీజేవైఎం రాయలసీమ జోనల్ ఇంచార్జ్ సుబ్బరాజు, బిజెపి కడప జిల్లా కార్యాలయ కార్యదర్శి సాయి ఈశ్వర్, మల్లికార్జున పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు



రామసముద్రం మార్చి 21 ప్రభాతవార్త:

ముస్లింల పవిత్రమైన రంజాన్ పండుగను మండలకేంద్రం, చెంబకూరు గొల్లపల్లెల్లో శనివారం ఘనంగా ఈద్గాలో సామూహిక ప్రార్థనలకు వేలాది మంది ముస్లింలు తరలివచ్చారు. కుటుంబసభ్యులంతా కొత్త వస్త్రాలు ధరించి భక్తిభావంతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఇమామ్ సూక్తులు చదివి వినిపించారు. అనంతరం దేశం,రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు చేశారు.అనంతరం ఈద్గా వద్ద ఇమామ్ నయ్యర్ అజం ఈదుల్ ఫితర్ ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం ఒకరికొకరు ఖీఈద్ ముబారక్ చెప్పుకుంటూ ఆలింగనం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ముత్వల్లి సిరాజ్ బాషా,ఆన్సర్ బాషా ఎంపిటీసీ మస్తాన్,మండలవైసీపీ మైనారిటీ అధ్యక్షులు సందూరి సర్దార్ బాషా,జావెద్, చాన్, చాంద్ బాషా, బాబాసాబ్, పోలీస్ రియాజ్ బాషా, టీచర్ షరీఫ్,టపాల మస్తాన్, రహమతుల్లా,రఫీ, ఇమ్రాన్ జవహర్, బంకోళ్ల బాబు,మస్తాన్ వల్లి, షాంశీర్ నిసార్ ఫ్రూట్స్ ఉస్మాన్,పరిసర గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి కానిస్టేబుల్ శ్రీనివాసులు బందోబస్తు నిర్వహించారు.

## రంజాన్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్న ముస్లిం సోదరులు



పులివెందుల,మార్చి 21 , ప్రభాత వార్త : పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు శనివారం ఎంతో భక్తి శ్రద్ధలతో పండుగను జరుపుకున్నారు. ఉదయం నుంచే మసీదులకు చేరుకున్న వారు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, దేశం మరియు సమాజం శాంతి సౌభాగ్యాల కోసం ప్రార్థించారు.మత పెద్దలు ఖలీఫాలు ఖురాన్ లోని వచనాలను ప్రబోధిం చారు. ఈ సందర్భంగా చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ కొత్త బట్టలు ధరించి ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ సందర్భంగా ప్రత్యేక వంటకాలు తయారు చేసి కుటుంబ సభ్యులతో పాటు బంధువులతో ఆనందంగా గడిపారు.అలాగే పేదలకు, నిరుపేదలకు ఆహారం, బట్టలు పంపిణీ చేస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. మరి కొంత మంది సేవా కార్యక్రమాలు నిర్వహించి, సమాజానికి తమవంతు సహాయం అందించారు. రంజాన్ పండుగ సోదరభావం, సహనానికి ప్రతీకగా నిలుస్తుందని మత పెద్దలు పేర్కొన్నారు. సమాజంలో శాంతి, ఐక్యత నెలకొనాలని వారు ఆకాంక్షించారు.

**CHANGE OF NAME**

I, **SHAIK NASIR KISHORE** (Old Name), W/o. **SHAIK MOHAMMEDALI**, residing at D.No.16/374-26-2, Ghouse Nagar, D.C. Road, Kadapa, YSR Dist-516001, A.P. I declare that I have change my name to **SHAIK NASIRA KISHWORI** (New Name).

**CHANGE OF SURNAME**

**SHAIK SODABANDI DASTAGIRI**, residing at D.No: 3-2-24, Porumamilla Road, Badvel, YSR Dist., A.P., hereby declare that I have changed my name from **SHAIK SODABANDI DASTAGIRI** (Old Name) to **SHAIK DASTAGIRI SODABANDI** (New Name)

# పిల్లల భవిష్యత్తులతో ఆడుకుంటున్న సచివాలయాలు

## అంటే ముట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు... సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజలు

**పీలేరు మార్చి 21 ప్రభాతవార్త:**
విద్యా సంవత్సరం ముగుస్తుంది వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులు క్లాసులు చేరడానికి ఏ దరఖాస్తు చేసుకోవాలన్న పోటీ పరీక్షలకు హాజరు కావాలన్నా రెవెన్యూ అధికారులు జారీ చేసే కుల, ఆదాయ, రెసిడెన్షియల్, బర్త్ సర్టిఫికెట్స్ ఎంతో కీలకంగా అవ్వటమే కాకుండా అవసరమని చెప్పవచ్చు. అలాంటి సందర్భాలలో విద్యార్థులు చదువుల కోసం ప్రజలు ప్రభుత్వం ప్రవేశపెట్టే నూతన పథకాలకు మీసేవ కేంద్రాలు లేదా సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలి ధ్రువపత్రాల కోసం సచివాలయాలకు ప్రజలు వెళుతున్న సచివాల సిబ్బంది కొంతమంది సరైన సమాధానం చెప్పకపోవడమే కాకుండా సకాలంలో విధులకు హాజరుకాకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. తీరా సచివాలయాలలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులు విలేజ్ రెవెన్యూ అధికారి లాగిన్ నుండి రెవెన్యూ ఇన్స్పెక్టర్ లాగిన్‌లోకి పంపించడానికి మరి కొద్ది రోజులు సమయం పడుతోంది. తీరా వీఆర్వోలను కలవాలన్న వారికి తీరిక లేకుండా రీ సర్వే వివిధ కార్యక్రమాల కోసం జిల్లా కేంద్రానికి డివిజనల్ కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది ఆ సమయంలో మరికొద్ది రోజులు కార్యాలలో చుట్టూ తిరగక ప్రజలకు తప్పలేదు. తీరా రెవెన్యూ అధికారులు లాగిన్ నుండి కార్యాలయాలకు పంపించిన కొన్ని తహసిల్దార్ కార్యాలయంలో పనిచేసే డిజిటల్ కి సంబంధించిన జూనియర్ అసిస్టెంట్లు సకాలంలో పని చేయకపోవడంతో పీలేరు రెవెన్యూ డివిజనల్ పరిధిలోని పీలేరు, కలికిరి, కె.వి పల్లి మండలాల్లోనే విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం సతమతమవుతున్నామని బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. కొన్ని సందర్భాలలో తమకున్న సొంత భూములను మార్పిడి చేసుకోవాలంటే ఫ్యామిలీ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్ కోసం సుమారు నెలలే పడుతుందని బహిరంగంగానే జనం ఆరోపిస్తున్న రెవెన్యూ సిబ్బంది అంటి ముట్టనట్లు వ్యవహరిస్తుండటం అందరికీ తెలిసింది. ఇకనైనా ముఖ్యంగా విద్యార్థులు తమ ఉన్నత చదువుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి సర్టిఫికెట్లతో పాటు జనన ,మరణ సర్టిఫికెట్లు ఆలస్యం లేకుండా మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.



**సర్టిఫికెట్లు మంజూరు చేయడంలో ఆలస్యం చేస్తే చర్యలు తప్పవు :**
పీలేరు రెవెన్యూ డివిజనల్ పరిధిలోని రెవెన్యూ సిబ్బంది విద్యార్థుల అవసరాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్జీలు సర్టిఫికెట్లను ఆలస్యం చేస్తే కఠినంగా చర్యలు ఉంటాయని పీలేరు ఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. ఎవరైనా అధికారులు సచివాలయ సిబ్బంది రెవెన్యూ విలేజ్ అధికారులు తహసిల్దారులు కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్న ప్రజలు నేరుగా తమకే ఫిర్యాదు చేయాలని ఆ ఫిర్యాదులపై తక్షణం స్పందించడం జరుగుతుందని ఆర్డిఓ అన్నారు.

**నిర్లక్ష్యం వాస్తవమే : శ్రీనివాస వర్మ**
విద్యార్థుల సర్టిఫికెట్లు , వివిధ రకాల సర్టిఫికెట్లు సకాలంలో మంజూరు చేయకపోవడం శోచనీయమని ఆదివాసి ఏరుకుల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ వర్మ తెలిపారు.



# క్రమశిక్షణ, దాత్పత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్



**సిద్దవటం మార్చి 21 ప్రభాతవార్త**
ముస్లింలు పవిత్రంగా భావించే దివ్య ఖురాన్ గ్రంథం ఈ మాసంలో అవిర్భవించడమే క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ అని ఇమాం సయ్యద్ పీర్ బాషా ఖాద్రి తెలిపారు. శనివారం పవిత్ర రంజాన్ ప్రార్థనలను ముస్లిం సోదరులు సిద్దవటం శివారులోని ఈద్గాలో నిర్వహించుకున్నారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ పండుగ, పర్వదినం అంటే శుభవేళ, ఉత్సవ సమయం అని అర్థమన్నారు.పండుగ మానావాళికి హితాన్ని బోధిస్తుందని, నెల రోజులు కఠోరవ్రతం పాటించినవారి శ్రమకు పరిపూర్ణ ప్రతిఫలం ఈ రోజే లభిస్తుందని విశ్వాసమన్నారు. ముస్లిం సహోదరులు ఈద్గాలో రంజాన్ ప్రత్యేక ప్రార్థన చేశారు. రంజాన్ పండుగ మతసామరస్యానికి, పరస్పర సదవగాహనకు, సమైక్యతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. రంజాన్ నెలలో మరొక విశేషం అత్యధిక దానధర్మాలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ముస్లిం సోదరులు రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సయ్యద్ జవహర్ భాష డైరెక్టర్ ఖాజాపీర్ ఉప సర్పంచ్ హిదాయతుల్లా వ్యవసాయం మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా కూల్ డ్రింక్ షాప్ గౌస్ ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



ఈద్ఉల్‌ఫితర్ ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

**రాజంపేట, మార్చి21 ప్రభాతవార్త:**
భక్తిశ్రద్ధలతో నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించి,ఖురాన్ పారాయణం, ప్రత్యేక ప్రార్థనలతో,జకాత్ దానాలతో పేదలకు ఆర్థిక సహాయంతో రంజాన్ మాసం పూర్తిచేసుకున్న ముస్లిం సోదరులు శనివారం స్థానిక బ్రాహ్మణపల్లె ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్నారు. సంతోషంతో నేడు ఈద్గాల నందు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, సృష్టికర్తకు ధన్యవాదములు తెలిపి, పరస్పర ఆలింగనలతో ముస్లిం సోదరులు తమ సంతోషాన్ని పంచుకున్నారు. మత గురువు మాట్లాడుతూ రంజాన్ మాసంలో పాటించిన విధంగానే ఇదే భక్తిభావం, దైవభీతి, నిరుపేదలు బలహీనులు పట్ల దయ సేవాగుణాన్ని రంజాన్ మాసం ద్వారా ఆలవర్చుకుని ఏడాది పొడవునా పాటించాలనేదే సృష్టికర్త అభిమతమని బోధించారు. ఈద్ సందర్భంగా మండలం లోని ఈద్గాలలో వేలాదిమంది ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా రాజంపేట ఈద్గా డెవలప్మెంట్ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా అన్ని ఈద్గాల వద్ద పోలీసుల ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం



**పీలేరు మార్చి 21 ప్రభాతవార్త:**
నియోజకవర్గంలోని కలికిరిలో ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అనునిత్యం పనిచేస్తామని కలికిరి తహసిల్దార్ సయ్యద్ అహ్మద్ తెలిపారు. వారములతో పని లేకుండా ప్రజా సమస్యల పరిష్కరించేందుకు ఎప్పుడు ముందుంటామని కలికిరి మండలంలో జరుగుతున్న సర్వే కార్యక్రమం వేగంగా ముందుకెళుతుందని ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించేందుకు రెవెన్యూ సిబ్బంది గ్రామాలలో సైతం ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు .ప్రజా సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తమతో కలవచ్చని తహసిల్దార్ తెలిపారు.

# ఉప్పతి శంకర్‌రెడ్డిని పరామర్శించిన మంచూరు

**బద్వేల్ అర్బన్, మార్చి 21, ప్రభాతవార్త**



అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరు అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మన్నెం వారి పల్లెకు చెందిన ఉప్పతి శంకర్‌రెడ్డిని ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, అవసరమైన మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. శంకర్‌రెడ్డికి ధైర్యం చెప్పి, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అరవ శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఊరించి ఉసురు మనిపించారు

**బద్వేల్ అర్బన్, మార్చి 21, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా జాబ్ కేలండర్ అని చెప్పి ఎన్నికల ముందు యువతకు హామీ ఇచ్చి తీరా రెండు సంవత్సరాల తర్వాత జాబ్ లెస్ క్యాలెండర్ విడుదల చేయడం నిరుద్యోగులను నయవంచన చేయడమేనని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని అన్నారు. శనివారం పట్టణంలోని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్,ఎస్కే ఆదిల్‌లతో కలిసి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ ఖాళీలకు తగ్గట్టు జాబ్ కాలండర్ విడుదల చేయలేదని ఇది ఎంతవరకు సమంజసమన్నారు. తక్షణమే జాబ్ క్యాలెండర్ను సవరించి కనీసం లక్ష పోస్టులతో కూడిన జాబ్ కేలండర్ను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. వయోపరిమితి 47కు పెంచాలని పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు 34 కు పెంచాలని డిమాండ్ చేశారు ప్రతి నోటిఫికేషన్ కోర్టుల చుట్టూ తిరుగుతున్నాయని అటువంటి పరిస్థితి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు లేనిపక్షంలో డివైఎఫ్ఐ యువజన సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడతామని వారు హెచ్చరించారు.

# స్మశాన వాటిక దారి శుభ్రం

**బద్వేలు అర్బన్ ,మార్చి 21 , ప్రభాతవార్త**



బద్వేల్ పట్టణంలోని గూడెం ప్రాంతంలో స్మశాన వాటికకు వెళ్లే దారి సరిగా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గమనించిన మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం మున్సిపల్ సిబ్బంది యుద్ధప్రతిపాదికన పని చేపట్టి, స్మశాన వాటికకు వెళ్లే మార్గంలో ఉన్న అడ్డంకులను తొలగించారు. దారిని పూర్తిగా శుభ్రపరచడంతో ప్రస్తుతం ప్రజలు సులభంగా రాకపోకలు సాగించగలుగుతున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. స్థానికులు కూడా అధికారుల తక్షణ స్పందనకు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను కాపాడడమే లక్ష్యం



**రాజంపేట, మార్చి 21 ప్రభాతవార్త**
ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునేందుకు యుటిఎఫ్ పిలుపు ఇచ్చింది. ఊరి బడిని కాపాడుకుందాం, ఊరి బడి లేకపోతే పేదలకు విద్య లేదని స్పష్టం చేసింది. శనివారం రాజంపేట పట్టణంలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన "ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పిద్దాం-ఊరి బడిని కాపాడుకుందాం" అనే నినాదంతో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.వెంకట సుబ్బయ్య అధ్యక్షతన ప్రాంతీయ సదస్సును నిర్వహించారు. సదస్సు ప్రారంభంలో యుటిఎఫ్ వ్యవస్థాపక నిర్మాత అప్పారి వెంకటస్వామి 26వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పేదలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య అందాలంటే ఊరి బడిని కాపాడుకోవాల్సిందేనని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబులు పేర్కొన్నారు. విద్యార్థుల సర్వతోన్ముఖాభివృద్ధికి పాటుపడుతూ, అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలలు నేడు పాలకుల విధానాల ఫలితంగా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. పేదల పట్ల మక్కువ లేని పాలకవర్గాలు కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ కార్పొరేట్ విద్యకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారన్నారు. ప్రభుత్వ బడిని కాపాడుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లావ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. హరి ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పాటుపడుతున్న ఘనత యుటిఎఫ్ కే దక్కుతుందన్నారు. యుటిఎఫ్ చేపట్టిన ఈ యజ్ఞంలో ఉపాధ్యాయ లోకం పెద్ద ఎత్తున భాగస్వాములై ఊరి బడిని కాపాడుకునేందుకు కంకణం కట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సి.వి.రమణమూర్తి, కె.రమేష్ జోషి, వై.శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చెంగల్ రాజు, రాజంపేట మండల ఉపాధ్యక్షులు వినోద్ కుమార్, ట్రెజరర్ శివ కుమార్, సుండుపల్లి మండల అధ్యక్షుడు జి.శంకరయ్య, నందలూరు మండలం అధ్యక్షుడు సుధాకర్, కృపానందం, ఉపాధ్యాయులు నరసయ్య, రవిచంద్ర ప్రసాద్, వెంకట సుబ్బయ్య, ఈశ్వర రాజు, నరేష్, విశ్వనాథ రెడ్డి,రమణ, రామ మోహన్, వెంకటస్వామి, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డీమాఫిని

# బకాయిదారులు వినియోగించుకోవాలి

## మున్సిపల్ కమీషనర్ ప్రమీల

**మదనపల్లె, మార్చి 21 ప్రభాతవార్త :**
మున్సిపల్ ఆస్థిపన్ను బకాయిలపై 50శాతం వడ్డీ మాఫీని బకాయిదారులు వినియోగించుకోవాలని మున్సిపల్ కమీషనర్ ప్రమీల తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఉన్న ఆస్థి పన్ను బకాయిపై ప్రభుత్వం ఉపసమనం ప్రకటించిందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్థిపన్ను బకాయిలపై ఉన్న వడ్డీలో 50శాతం వరకు మాఫీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పన్ను చెల్లింపుదారులు వందశాతం ప్రధానపన్ను, 50శాతం వడ్డీనీ ఒకేసారి చెల్లిస్తే ఈ మాఫీ వర్తిస్తుందన్నారు. ఈ పథకం ఈనెల 31వరకు అమలులో ఉంటున్నారు. మున్సిపాలిటిలో ఆస్థిపన్ను బకాయిదారులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు ఈ నెలాఖరులోపు ఆస్థిపన్ను వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



# అన్నదమ్ములపై దాడి

**మదనపల్లెక్రైమ్, మార్చి 21 ప్రభాతవార్త.**
అన్నదమ్ములపై కొందరు తాగుబోతులు దాడి చేసిన సంఘటన శుక్రవారం రాత్రి మదనపల్లిలో జరిగింది. బాధితులు టూ టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. పట్టణంలోని మునెప్పకాలనీకి చెందిన నరసింహులు(29) అతని తమ్ముడు రెడ్డి నీలేశ్వర్(16) రాత్రి చౌడేశ్వరి అమ్మవారి జాతరలో నడుచుకుని వెళ్తుండగా, ఆరోగ్య వరం యువకులు వారిని బైక్ తో ఢీకొట్టారు. దీంతో నరసింహులు స్కూటర్నులను నిలదీశాడు. మదనపల్లె మండలం, ఆరోగ్యవరానికి చెందిన మరి కొందరు యువకులను ఫోన్ చేసి పిలిపించి నరసింహులు అతని తమ్ముడిపై దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఒంటిమిట్టలో రంజాన్ వేడుకలు

**ఒంటిమిట్ట మార్చి.21. ప్రభాతవార్త**
మండల కేంద్రమైన ఒంటిమిట్టలో శనివారం రంజాన్ పర్వదిన సందర్భంగా ముస్లిం సోదరులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పొలిమేరలో ఉన్న మసీదు వద్ద ముస్లింలందరూ సమావేశమయ్యారు. అనంతరం మత గురువు భక్తిశ్రద్ధలతో పవిత్ర కురాన్ గ్రంథం పఠించి అందులోని నీతి సూత్రాలు తెలియజేయడం జరిగింది. ప్రతి ముస్లిం జీవితకాలంలో ఒక్కసారైనా మక్కా యాత్ర చేయాలన్నారు. ఐదు పూటల నమాజ్ చేయాలన్నారు. నీతి నిజాయితీగా ధర్మబద్ధంగా, అందరితో స్నేహపూర్వకంగా సోదర భావంగా ఇతర మతాలను గౌరవిస్తూ దానధర్మాలు చేస్తూ దైవచింతనతో బతకాలన్నారు. అనంతరం ముస్లిలందరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.



# ప్రారంభమైన చైత్రమాసం పూజా

**గోపవరం. మార్చి 21. ప్రభాతవార్త.**
మండలం వల్లేరవారి పల్లె గ్రామం లో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు చైత్ర మాసం ప్రారంభంతో వైభవంగా సూర్యోదయ అభిషేకం రాహుకాలం హోమం పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగినది, తదుపరి స్వామి అమ్మవారు ప్రత్యేక పూల అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు, తదుపరి వచ్చిన భక్తులు మాట్లాడుతూ ఆలయంలో స్వామి వారి మూల విరాట్ చూడటానికి చాలా చూడ ముచ్చటగా ఉన్నారు అని అలాగే ప్రతి శనివారం ఆలయంలో వచ్చిన వ్యక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్న ప్రసాద కార్యక్రమం ఆలయ పూజారి మాకు ఉన్న కష్టాలను తెలిపి తగిన జాగ్రత్తలు సూచనలు తెలియజేస్తారని అలాగే ఎటువంటి అనారోగ్య సమస్య మాకు తెలిపి పరిష్కారం తెలుపుతూ ఉన్నారు, ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ ఫితర్..



**బ్రహ్మంగారిమఠం,మార్చి 21 ప్రభాతవార్త**
రంజాన్ పండుగ(ఈద్ఉల్‌ఫితర్) ఇస్లాం ధర్మములో అత్యంత పవిత్రమైనది, క్రమశిక్షణకు, దాతృ త్వానికి, సహనానికి ప్రతీకగా ఈ రంజాన్ పండుగ జరుపుకుంటారు. 21వ శనివారం ఉదయం నుండి మండలంలోని సోమిరెడ్డి పల్లి, రాజుపేట గ్రామాల్లో ఉంటున్న ముస్లిం సోదరులందరూ ప్రార్థనలు చేయడం ఇఫ్తార్ విందు పంచుకోవడం ద్వారా ఐక్యతను చాటుతారు. ఒక నెల రోజులుగా సూర్యోదయం నుండి సూర్యాస్తమ యం వరకు క్రమశిక్షణతో కూడిన ఉపవాసముండి ఆత్మశుద్ధి చేసు కుంటారు. ఈ రంజాన్ పండుగలో పేద వారికి దానధర్మాలు చేయడం ముస్లిం సోదరుల ఆనవాయితీ. ఈ మాసంలోనే పవిత్ర ఖురాన్ అవతరించిందని వారి విశ్వాసం అందుకే నమాజ్ తరావిహ్ ప్రార్థ నలకు ప్రాముఖ్యత ఇస్తుంటారు. ప్రేమ, శాంతి, మరియు సోదర భావం కూడిన ఈద్ ముబారక్ శుభాకాంక్షలు కుల మతాలకు అతీతంగా హృదయానికి హత్తు కొని ఒకరికి ఒకరు ప్రేమను ఐక్యతను పంచుకుంటారు. మండలంలో రంజాన్ వేడుకలను ప్రత్యేక ప్రార్థనలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకోవడం హర్షించదగ్గ విషయం.

# ఘనంగా రంజాన్ వేడుకలు

**దువ్వూరు మార్చి 21 ప్రభాతవార్త**
మండలంలో ముస్లింలు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని చింతకుంట, గుడిపాడు, నేలటూరు, చల్లబసాయపల్లి కానగూడూరు, కృష్ణంపల్లి, ఎర్రబల్లి, వెంకుపల్లి, ఇడమడక దువ్వూరు గ్రామాలలోని ఈద్గాలలో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఈద్ఉల్‌ఫితర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. దువ్వూరులోని హస్మి మసీదులో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాత దువ్వూరు లోని ఈద్గాలో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గాలో పేస్ ఇమామ్ జాఫర్ సాధక్ ముస్లింలతో ప్రత్యేక సామూహిక నమాజు చేయించారు. ఈ సందర్భంగా ఇమామ్ జాఫర్ సాధక్ మాట్లాడుతూ జీవితంలో తెలిసో తెలియక ఏడాది పాటు చేసిన తప్పులను సమూలంగా కడిగేసే అవకాశం పవిత్రమైన రంజాన్ మాసంలో లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. అల్లా సూచనలను ఖచ్చితంగా పాటించినప్పుడే దైవానికి దగ్గరవుతామని వివరించారు. మానవాళి సుఖ సంతోషాలతో ఉండాలంటే అందరూ ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు చేయాలని కోరారు. రంజాన్ సందర్భంగా ముస్లింలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఈద్గాల వద్ద దువ్వూరు ఎస్ఐ ధనుంజయుడు పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

# భక్తి శ్రద్దలతో రంజాన్ వేడుకలు



**సుండుపల్లి, మార్చి 21,ప్రభాతవార్త :**
మండల పరిధిలోని ఈద్గా మైదానంలో ఈద్ఉల్‌ఫితర్ సందర్భంగా రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.ప్రార్థనల అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ సందర్భంగా వేడి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని జి కె రాచపల్లె ఈద్గా దగ్గర మరియు అగ్రహారం ఈద్గా దగ్గర ఉన్నటువంటి ముస్లిం సోదరులకు మానవతా సంస్థ కార్యవర్గ సభ్యుడు ఉస్మాల్ బాష మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.పలువురు స్థానికులు ఇటువంటి సేవా కార్యమాలు చేయడం వలన సామాజిక ఐక్యతను పెంపొందిచడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈద్గాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మండల ఎస్ఐ హుసేన్ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణి



**రామసముద్రం మార్చి 21 ప్రభాతవార్త**
ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంతో లో అనారోగ్యంతో మంగమ్మ మరణించడంతో ఆమె భర్తకు కు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్ అందజేశారు,పుంగనూరు మండలం మర్సనపల్లి నందు ముఖ్యమంత్రి సహాయనిధి మంగమ్మ భర్త నరేష్‌కి పుంగనూరు మండల సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం రాజు(మిలిటరీ బాబు) చెక్కులను అందజేశారు . ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పెద్దలు చంద్రబాబు నాయుడు పేదల పక్షాన ఆలోచిస్తూ వివిధ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందిన బిల్లులను సహాయ నిధి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా తిరిగి అందించడం చాలా సంతోషమని అన్నారు.ఈ కార్యక్రమంలో టి ఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పురి రమేష్ ఈడిగపల్లి నరసింహులు కూర శ్రీనివాసులు బీసీ సెల్ జిల్లా కార్యదర్శులు ఏ కుమార్ శేఖర్ గంగులప్పా రవి నాయుడు గంగరాజు సాతర్ల సుబ్రహ్మణ్యం చెన్నకేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 8 సం"నిండిన

# ప్రతి ఒక్క పౌరుడు ఓటు హక్కు పొందాలి

**మైదుకూరు, మార్చి 21, ప్రభాతవార్త:**
భారతీయ జనతా నాయకత్వంలో పట్టణంలోని ఎస్వీ కోచింగ్ సెంటర్ భవనం లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు స్పెషల్ ఇంటర్యూ రివిజన్ ఎస్ఐఆర్ బిజెపి అసెంబ్లీ ఇన్చార్జి ఆరవేటి హరికృష్ణ అధ్యక్షతన మైదుకూరు అసెంబ్లీ కర్యశాల జరిగింది. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకటసుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఎస్ఐఆర్ పై నాయకులకు అవగాహన కల్పించడం జరిగింది. భారతీయ జనతా పార్టీ కేంద్ర నాయకత్వం ఎస్ఐఆర్‌పై ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారని ప్రజాస్వామ్య విజయం కోసం ప్రతి బూతుకు బూతు లెవెల్ ఏజెంట్ నియమించి పర్యవేక్షించాలని కోరారు. ఆరవేటి హరికృష్ణ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ చేస్తున్న ఈ కార్యక్రమాన్ని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితాను ఖచ్చితత్వంతో రూపొందించడంలో ఎస్ఐఆర్ తోడ్పడుతుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క పౌరుడు తన ఓటును నమోదు చేసుకుని ఎస్ఐఆర్ కు సహకరించడం ప్రజాస్వామ్య విజయాన్ని కోరుకోవడమేనన్నారు.ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి, బూతు ఏజెంట్ల నియామకం కోసం అసెంబ్లీలోని ఆరు మండలాలకు త్రిసభ్య కమిటీని నియమించడంతోపాటు నియోజకవర్గంలోని మైదుకూరు పట్టణానికి గోశెట్టి మనోహర్, శ్రీధర్, దేవేంద్ర, రూరల్ మండలానికి జిబిసి గురప్ప, వెంకటరామయ్య, భార్గవ్ యాదవ్ దువ్వూరు మండలానికి రాముని రెడ్డి, రంగనాథ్, సుబ్బారెడ్డి చాపాడు మండలానికి ఋష కేశవ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి కాజీపేట మండలానికి రాజశేఖర్ రెడ్డి, ఉదయ్, శ్రీకాంత్ రెడ్డి బి. మఠం మండలానికి రవి, ఉదయ్, చంద్రఓబుల్ రెడ్డిలను నియమించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు. పవన్ కుమార్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ నాయుడు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఓబులేసు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అజయ్ నరహరి రఘునాథ రెడ్డి, బాలనాగిరెడ్డి, కేశవరెడ్డి, లక్ష్మయ్య యాదవ్, ఎల్లారెడ్డి, మురళి ఈశ్వరయ్య గోపి తదితరులు నాయకులు పాల్గొన్నారు.




# ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**బద్వేల్ అర్బన్ మార్చి 21 ప్రభాత వార్త :**
మున్సిపాలిటీ పరిధి లక్ష్మీపాలెంలో వెలిసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకం కుంకుమార్చనతో పలు పూజలను నిర్వహించారు, తెల్లవారుజాము నుండి భక్తాదులందరూ భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు, స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ప్రత్యేక తీర్థప్రసాదాలను అందజేశారు, అలాగే శనివారం ఉదయం బిజెపి జిల్లా పార్లమెంట్ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు స్వామివారిని దర్శించుకున్నారు, వారికి ఆలయ కమిటీ సభ్యులు మాజీ నీటి సంఘం అధ్యక్షులు ఒంటె పీరయ్య, ధర్మకర్త యం,సుబ్బయ్య, బీనా గోపాలకృష్ణ, వేద పండితులు భరద్వాజ్, శ్రావణ్ సాధర్వంగా ఆహ్వానం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి వస్త్రం, పూలమాలతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు,



రాష్ట్ర ప్రజలందరికీ కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి కరుణ కటాక్షాలు ఉండాలని వారు ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు గ్రామ ప్రజలు కమిటీ సభ్యులు 6, టీవీ రిపోర్టర్ ఆవులేటి శేఖర్ రాయల్, వ్యల్లకొండు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

# పీలేరులో భక్తి శ్రద్ధలతో ఈద్‌ఉల్‌ఫిత్ర

**పీలేరు మార్చి 21 ప్రభాతవార్త:**

పీలేరులో ముస్లింలు ఈద్ ఉల్ ఫిత్ర (రంజాన్) పండుగ వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించారు. శనివారం పట్టణంలోని అన్ని మసీదుల నుంచి ముస్లిం సోదరులు స్థానిక జెండామాను దగ్గరకు చేరుకుని, అక్కడి నుంచి సామూహికంగా అల్లాను స్తుతిస్తూ మదనపల్లి మార్గంలోని ఈద్గా మైదానం చేరుకుని, పండుగ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇమామ్ మాట్లాడుతూ ముస్లింలు పవిత్ర రంజాన్ నెలవంక దర్శనం తరువాతి రోజు నుంచి కఠోర ఉపవాస దీక్షలను ప్రారంభించి, నెల రోజులు పాటు వాటిని ఆచరించి తిరిగి శుక్రవారం నెలవంక దర్శనంతో శనివారం రంజాన్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లింలు తాము చేసుకునే పండుగల్లో అతి ముఖ్యమైన పండుగ ఈద్ ఉల్‌ఫిత్ర ఒకటని, రంజాన్ పండుగ ప్రార్థనల అనంతరం వారి శక్తి కొలది పేదలకు నగదు, వస్త్ర దానాలు చేసుకుంటారన్నారు. ఈ సామూహిక ప్రార్థనలు చేయించిన మత గురువు ముఫ్తీ అబ్దుల్లా దువా చేస్తూ ప్రజలను ఈతి బాధలు, వేసవి ఎండల నుంచి కాపాడాలని, ముస్లీం యువత చెడు అలవాట్లకు, అసాంఘిక కార్యక్రమాలకు లోను కాకుండా చూడాలని, ప్రజలు అనారోగ్యం బారిని పడకుండా కాపాడాలని, జనం పరమత సహనంతో సాటి వ్యక్తుల పట్ల ప్రేమ, ఆప్యాయతలు కలిగి ఉండేలా చూడాలని, పశ్చిమ ఆసియా ప్రాంతంలో చోటు చేసుకున్న యుద్ధ వాతావరణం నుంచి ప్రజలను శాంతి మార్గం వైపుకు నడిపించాలని ప్రార్థించి వేడుకున్నారు. ప్రార్థనల అనంతరం ప్రతి ఒక్కరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పీలేరు పట్టణ సిఐ యుగంధర్ పర్యవేక్షణలో ఎస్ఐ, సిబ్బంది ఈద్గా, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా గట్టి బందోబస్తుతోపాటు వాహనాల రాక పోకలను కూడా నియంత్రించి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. అలాగే పీలేరు మండలంలోని తలుపుల, జాండ్ల, బాలంవారిపల్లి, రేగళ్లు, వంటిల్లు మొదలగు గ్రామాల్లోనూ ముస్లింలు రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు జరుపుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం సోదరులు

## మండెం లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న మంత్రి

**చిన్నమండెం మార్చి 21 ప్రభాతవార్త :**

మండలంలోని దేవగుడిపల్లి గ్రామ పరిధిలోని జిల్లావాండ్లపల్లి గ్రామంలో మాండవ్య నది ఒడ్డున వెలసిన ప్రసిద్ధ శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాలను సందర్శించి, కొనసాగుతున్న ఆలయ నిర్మాణ పనులను సమగ్రంగా పరిశీలించారు. పనులు నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే, ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రాంతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. భక్తుల రాకపోకలు పెరిగే దృష్ట్యా మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.





## బెయిల్ మంజూరు చేసినపుడు పైకం డిపాజిట్ చేయాల్సిన అవసరం లేదు

### (సుప్రీం కోర్టు పునరుద్ఘాటనతో కూడిన తీర్పు)

**బద్వేలు లీగల్, మార్చి 21 ప్రభాతవార్త:**

న్యాయస్థానాలు రెగ్యులర్ లేదా ముందస్తు బెయిల్ మంజూరు చేసినపుడు ఏలాంటి మొత్తాన్ని డిపాజిట్ చేయవలసిన అవసరం లేదని సుప్రీం కోర్టు పునరుద్ఘాటించింది. ప్రస్తుత కేసులో జార్ఖండ్ హైకోర్టు జారీ చేసిన షరతులతో కూడిన బెయిల్ ఆదేశాలను న్యాయస్థానం ప్రక్కన పెట్టింది. ఒక వేళ అరెస్టు జరిగితే నిందితులను బెయిల్ పై విడుదల చేయాలని ఆదేశించిది. ఆర్డరు కాపీని జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపాలని కూడా రిజిష్టరీని కూడా కోరింది. మోసం కేసులో నిందితులైన తండ్రి కొడుకులకు హైకోర్టు ముందస్తు బెయిల్‌ను నిరాకరించింది. ఫిర్యాదుదారు నుండి క్రాఫ్ట్ పేపర్లను కొనుగోలు చేసిన తరువాత నిందితులు పైకం చెల్లించడంలో విఫలమయ్యారని ఫిర్యాదులో ఆరోపించబడింది. ఆ మేరకు ఎఫ్ఐఆర్ దాఖలు కాగా అరెస్టును ఊహించి నిందితులు సెషన్సు కోర్టులో బెయిల్ కొరకు దరఖాస్తు చేయగా అది తిరస్కరించడంతో హైకోర్టును ఆశ్రయించగా ఫిర్యాదుదారుకి పైకం చెల్లించినట్లు అనుబంధ అఫిడవిట్టును దాఖలు చేయాలని ఆదేశించగా తదనంతరం నిందితులు సమయం కోరినంతట హైకోర్టు వారికి సమయం మంజూరు చేస్తూనే మరో ఉత్తర్వు కూడా జారీ చేసింది. జనవరి 13, 2025 మరియు నవంబరు 14, 2025 తేదీల నాటి రెండు ఉత్తర్వులలో చెల్లింపును చూపించే అఫిడవిట్టు దాఖలు చేయకపోతే ముందస్తు బెయిల్ దరఖాస్తును తదుపరి సూచనలు లేకుండా కొట్టివేస్తామని హైకోర్టు ఆదేశించింది. సదరు ఆదేశాలను ఛాలెంజ్ చేస్తూ తండ్రి, కొడుకులు దాఖలు చేసిన పిటీషనుపై జస్టిస్ జెబి పార్థివాలా మరియు జస్టిస్ కెవి విశ్వనాథన్ లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపి హైకోర్టు "అసాధారణ ఆదేశాలు" జారీ చేసిందని ధర్మాసనం ప్రారంభంలోనే వ్యాఖ్యానిస్తూ గజాననన్ దత్తాత్రేయ గోర్ ఎదిరి స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర (2015) కేసులో జస్టిస్ జెబి పార్థివాలా మరియు జస్టిస్ ఆర్ మహదేవన్ లతో కూడిన ధర్మాసనం బెయిల్ దరఖాస్తులను నిందితుల హామీ ఆధారంగా కాకుండా అర్హతల ఆధారంగానే తీర్పునిచ్చిన విషయాన్ని గుర్తుచేసింది. సుప్రీం కోర్టు స్పష్టమైన తీర్పును ఇచ్చినప్పటికీ హైకోర్టులు ఇటువంటి బెయిల్ ఉత్తర్వులను జారీ చేస్తూనే వుండటం వల్ల ధర్మాసనం విస్మయం వ్యక్తం చేస్తూ "రెగ్యులర్ బెయిల్ లేదా ముందస్తు బెయిల్ మంజూరు చేయడానికి ఎటువంటి మొత్తాన్ని డిపాజిట్ చేయకూడదని ఈ కోర్టు వివరంగా చెప్పినప్పటికీ పిటీషనర్లు మిగిలిన మొత్తాన్ని డిపాజిట్ చేయాలని హైకోర్టు చెప్పింది. పైన పేర్కొన్న మా తీర్పులో, బెయిల్ లేదా ముందస్తు బెయిల్ మంజూరు కొరకు వ్యాజ్యం దాఖలు చేయబడితే కోర్టు తగిన ఉత్తర్వు జారీ చేయడానికి ముందుకు సాగాలని, బెయిల్ ఇవ్వడమో తిరస్కరించడమో చేయాలేగానీ కోర్టు ఒక నిర్దిష్ట మొత్తాన్ని డిపాజిట్ చేయడానికి షరతులతో కూడిన ఉత్తర్వులను జారీ చేయకూడదని, దానిపై తన విచక్షణను ఉపయోగించకూడదని మేము స్పష్టంగా చెప్పాము." అని సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంటూనే అరెస్టు సందర్భంలో దర్యాప్తు అధికారి విధించిన షరతులకు లోబడి వారిని బెయిల్‌పై విడుదల చేయాలని సుప్రీం కోర్టు ధర్మాసనం ఆదేశించింది. (శీర్షిక: ప్రశాంత్ కుమార్ అండ్ మరొకరు ఎదిరి జార్ఖండ్ ప్రభుత్వం అండ్ మరొకరు ఎస్ఎల్‌పి(క్రిమినల్) డైరీ నెం. 4297/2026)

## నరసింహాస్వామి ఆలయంలో పూజలు

**మదనపల్లె, మార్చి 21 ప్రభాతవార్త :**



మదనపల్లె సమీపంలోని అనపగుట్ట, శ్రీవారినగర్‌లో వెలసియున్న శ్రీ అభయ లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో శనివారం మత్స్య జయంతి సందర్భంగా వైభవంగా మత్స్య హోమం జరిగింది. ఆలయ నిర్వాహకులు, ప్రధాన అర్చకులు రమేష్ స్వామి ఆధ్వర్యంలో హోమం, పూజలు ఘనంగా జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని హోమంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అంతేకాకుండా శ్రీ అభయలక్ష్మీనరసింహాస్వామికి శనివారం సందర్భంగా ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు.

# మైనారిటీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు

**రాజంపేట, మార్చి 21 ప్రభాతవార్త:**

మైనారిటీల సంక్షేమానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. శనివారం పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని కఠిన ఉపవాసాల అనంతరం బ్రాహ్మణ పల్లె ఈద్గా మైదానం నందు ప్రార్థన కార్యక్రమానికి హాజరై ముస్లిం సోదరులకు చమర్తి జగన్ మోహన్ రాజు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం సోదరులకు ఖర్జూరాలు తినిపించి ఉపవాసం విరమింపచేశారు. ముస్లిం సోదరులను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు.ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ రంజాన్ అనేది కేవలం ఉపవాస దీక్ష మాత్రమే కాదని,అది క్రమశిక్షణకు, దాతృత్వానికి, మానవీయ విలువలకు ప్రతీక అన్నారు. పేదలకు సాయం చేయడం అల్లా నామస్మరణంలో గడపడం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు.అంతేకాకుండా కలిసిమెలిసి ఉండడమే నిజమైన అభివృద్ధి అని,కుల మతాలకు అతీతంగా మానవత్వమే ప్రాతిపదికగా సాగే ప్రగతికి కట్టుబడి ఉన్నామన్నారు.మీ ప్రార్థనల్లో రాజంపేట నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని,ప్రజలందరి ముఖాల్లో చిరునవ్వులు చిందించాలని కోరుకున్నట్లు చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు. ఈ పవిత్రమైన సమయంలో,సమాజంలో సోదర భావం మరింత బలోపేతం కావాలని,అందరి హృదయాల్లో శాంతి వెల్లివిరియాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మైనారిటీ ముఖ్య నాయకులు అబూబకర్, ఎస్కే కరీం, గుల్జార్ భాష, ముస్లిం మైనారిటీ నాయకులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ముస్లిం సోదరులతో జగన్మోహన్ రాజు మమేకం

## విగ్రహ ప్రతిష్టకు మంత్రిని ఆహ్వానించిన భక్త బృందం

### నాలుగు రోజులు పాటు జరగనున్న ఉత్సవాలు



మంత్రిని ఆహ్వానిస్తున్న దృశ్యం

**మదనపల్లె, మార్చి 21 ప్రభాతవార్త :**

తంబళ్ళపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోట మండలం గోళ్ళపల్లె గ్రామం దేవళంగడ్డ వద్ద నూతనంగా పునర్‌నిర్మించిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 25న బుధవారం జరిగనున్న విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి విచ్చేయాలంటూ శనివారం ఆలయ భక్తబృందం రాష్ట్ర రవాణ, క్రీడల శాఖామంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డిని ఆహ్వానించారు. మంత్రితో పాటు తెలుగుదేశం పార్టీ పార్లమెంటు అధ్యక్షులు సుగవాసి ప్రసాద్‌బాబుకు కూడా విగ్రహ ప్రతిష్ట ఆహ్వానపత్రం అందజేసి విచ్చేయాల్సిందిగా కోరారు. 22నుంచి 25 వరకు నాలుగు రోజులు పాటు శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి మూలవిగ్రహ ప్రతిష్ట, మహాకుంభాభిషేకం వైభవంగా జరగనున్నట్లు ఆలయ భక్తబృందం తెలిపారు. భక్తాదులు అందరూ విచ్చేసి శ్రీవారిసేవలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

### కడప శిల్పారామంలో

# చిన్నారుల అధరహో..

**కడప కార్పొరేషన్ మార్చి 21 ప్రభాతవార్త:**

కడప శిల్పారామంలో రంజాన్ పండుగ సందర్భంగా సాంస్కృతిక కళావేదిక పైన పద్మాకర్ ఆధ్వర్యంలో కడప నగరానికి చెందిన సార్ డాన్స్ అకాడమీ శాస్త్రీయ పల్లె, జానపదాలు, సినీ నృత్యాలతో అదరహో అనిపించారు. వరాలు వరాలు,గరం గరం పోరి, వాన వాన వెలువాయి వంటి పాటలు అలరించాయి. సంస్కృతిక కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి కృష్ణ ప్రసాద్ పర్యవేక్షించారు.



# పేదరికం లేని సమాజ నిర్మాణమే రంజాన్ ఆశయం

### - ఫిత్రా, జకాత్‌లు పేదలకు తోడ్పడాలి - రంజాన్ ఈద్ ప్రార్థనల్లో మత గురువుల పిలుపు

**మదనపల్లె, మార్చి 21 ప్రభాతవార్త :**

పేదరికం లేని సమాజ నిర్మాణమే రంజాన్ పండుగ ఆశయమని స్థానిక జామియా మసీదు ఇమాం మౌలానా జలాలుద్దీన్‌సాహెబ్ పేర్కొన్నారు. మదనపల్లెలో శనివారం ఉదయం ఈద్-ఉల్-ఫితర్ పండుగను ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఇందులో భాగంగా స్థానిక నక్కలదిన్నెలోని ఈద్‌గా మైదానంలో ప్రత్యేక సామూహిక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా మౌలానా జలాలుద్దీన్ సాహెబ్ ధార్మికోపన్యాసం చేశారు. రంజాన్ మాసంలో చేపట్టే జకాత్ పిత్రా, సదాఖాలు పేదలకు తోడ్పాడాలన్నారు. రంజాన్ స్ఫూర్తిని జీవితాంతం కొనసాగించాలని తద్వారా ఆదర్శ సమాజ నిర్మాణంలో తమ తమ మతాలు ఆచారాలను పాటిస్తూనే ఎదుటివారి విశ్వాసాలను గౌరవించాలన్నారు. పండగ విశిష్టతను తెలియజేశారు. రంజాన్ పండుగను పురష్కరించుకొని ముస్లిం సోదరులు ఉదయం మసీదుల వద్దకు చేరుకొన్నారు. అల్లాహుఅక్బర్, అల్లహుఅక్బర్, లాఇలాహ ఇల్లహు అల్లాహుఅక్బర్ వలిల్లాహిల్‌హమ్ అనే ప్రత్యేక తక్బీర్‌ను పఠిస్తూ ఈద్‌గా మైదానానికి వెళ్ళి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఒకరినొకరు అలింగనం చేసుకొని ఈద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అనంతరం ఖబ్రస్థాన్‌కు వెళ్ళి పూర్వీకుల ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేశారు. నక్కలదిన్నె ఈద్గా మైదానం, బసినికొండ పంచాయితీ డ్రైవర్స్ కాలనీలోని ఈద్‌గాలలో జరిగన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొన్నారు. ప్రార్థనల్లో మైనార్టీ నాయకులు ఎస్.ఎ.మస్తాన్, పఠాన్‌ఖాదర్ ఖాన్, షేక్ కరీముల్లా, షంషీర్, నాగూర్‌వల్లి, లతీఫ్ ముస్లింలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో టి.తుమ్మలపల్లెలో వైభవంగా గంగమ్మ జాతర

**పులివెందుల , మార్చి 21 ప్రభాతవార్త :**

పులివెందుల నియోజకవర్గంలోని తొండూరు మండలం టి. తుమ్మలపల్లెలో గంగమ్మ జాతరను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి ప్రారంభమైన జాతర ఉత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా కొనసాగాయి. తెల్లవారుజామున గ్రామస్తులు శాస్త్రోక్తంగా బలి చాట నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు పెద్ద ఎత్తున గంగమ్మ అద్దక చేరుకుని కాయ కర్పూరాల అర్పించి గ్రామాన్ని చల్లగా చూడాలంటూ ప్రార్థించారు. జాతరలో భాగంగా నిర్వహించిన సిరిబండి మహోత్సవం విశేష ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా హాజరై భక్తి ఉత్సాహాలను వ్యక్తం చేశారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రూరల్ సీఐ సీతారాంరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. వారి పర్యవేక్షణలో కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. ఈ జాతరలో గ్రామస్థాయిలో చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ పాల్గొనగా, మహిళల పాల్గొనడం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. మొత్తంగా గంగమ్మ జాతర గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది.



### అట్టహాసంగా

# ప్రారంభమైన పెద్దమ్మ, చిన్నమ్మల జాతర..





**ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 21, ప్రభాతవార్త :**

శివనామస్మరణతో పులకించే రామేశ్వర పుణ్యక్షేత్రం ఇప్పుడు శక్త్యాగమనానికి వేదికైంది. లోకపావనులైన రామేశ్వరం పెద్దమ్మ, చిన్నమ్మల జాతర మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా, హఠాత్తుగా ప్రారంభమై భక్తజనులను పరవశింపజేసింది. జాతర ప్రారంభోత్సవంలో భాగంగా ప్రొద్దుటూరుకు చెందిన మహిళలు ప్రదర్శించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లయబద్ధమైన అడుగులు, కర్రల చప్పుళ్లతో వీధులన్నీ మారుమోగిపోయాయి. మరో వైపు హైదరాబాద్ భాగ్యనగరం నుంచి తరలివచ్చిన మహిళా భక్తులు అమ్మవారి వేషధారణలో మెరిసిపోయారు. నెత్తిన బోనాలను ధరించి, వారు వేసిన అడుగులు నేడు జరగబోయే బోనాల జాతర ఏ స్థాయిలో ఉండబోతుందోనన్న దానికి అద్దం పట్టాయి. ఇక నంద్యాల నుంచి వచ్చిన కళాకారులు కాళికాదేవి రూపాల్లో చేసిన గంభీర ప్రదర్శనలు భక్తులను ఆశ్చర్యచకితులను చేస్తూ, భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి.

### మట్టితో ప్రాణం.. శాలివాహనుల నైపుణ్యం

అమ్మవార్ల విగ్రహాల తయారీలో ఈసారి కూడా అత్యంత పవిత్రతను చాటుకున్నారు. సాంప్రదాయం ప్రకారం కోనేటి వారి అనుమతి పొందిన అనంతరం, శాలివాహన కులస్థులు పవిత్రమైన మట్టితో అమ్మవార్ల రూపాలను మలిచే అపురూప ఘట్టానికి శ్రీకారం చుట్టారు. అత్యంత నిష్ఠతో సాగుతున్న ఈ విగ్రహ తయారీ ప్రక్రియను చూసేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు.

### నిఘా నీడలో రామేశ్వరం

జాతర ప్రాముఖ్యత దృష్ట్యా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బృందాలను రంగంలోకి దించారు. స్థానిక పోలీసులతో పాటు ఇంటెలిజెన్స్ వర్గాలు రహస్యంగా నిఘా ఉంచాయి. ప్రాంతమంతటా జల్లెడ పడుతూ భద్రతను పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంది.

## ఘనంగా వేంపల్లెలో ఈదుల్ ఫితర్

**వేంపల్లి మార్చి 21 ప్రభాతవార్త**

వేంపల్లె గ్రామంలో మైనార్టీ సోదరులు అందరూ ఘనంగా ఈదుల్ ఫితర్‌ను ఘనంగా నిర్వహించారు. ముస్లింలు పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా శనివారం స్థానిక ఈద్గా మైదానంలో ముస్లిం మైనార్టీ సోదరులు అందరూ సామూహిక ప్రార్థనలు జరిపారు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ముస్లిం సోదరులు అందరు ఉదయాన్నే లేచి కొత్త బట్టలు తొడిగి ఈద్గా వద్దకు ప్రత్యేక ప్రార్థనలు కోసం చేరుకున్నారు. ప్రత్యక ప్రార్థనల్లో రెండు రకాతులు నమాజ్ ను మర్కస్ మసీదు మదరాసా మోలానా అబుబకర్ ఈదుల్ ఫితర్ అంటే దానధర్మాలు చేయమని మైనార్టీ సోదరులకు వివరించారు. షవ్వాల్ నెల మొదటి రోజున జరుపుకునే అతిపెద్ద వేడుకల్లో రంజాన్ పండుగని మోలానా అబుబకర్ అన్నారు. దానధర్మాలు (జకాత్) చేయడం ఈ పండుగ ప్రత్యేకతని తెలిపారు. ఇది సోదరభావాన్ని, సంతోషాన్ని పంచుకునే పండుగ అన్నారు. దేశంలో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేసినట్లు మోలానా తెలిపారు. అలాగే వేంపల్లె మండలంలోని మదీనాపురం, వీరన్నగట్టుపల్లె, పాములూరు గ్రామంలో కూడ ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నెల రోజుల ఉపవాస దీక్షల తర్వాత ప్రత్యేక నమాజ్ చేసి ముస్లిం సోదరులు అందరూ అలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే ఏమైనా తప్పులు ఉంటే క్షమించాలని ఒక్కరిని ఒక్కరూ వేడుకున్నారు. ఈద్గాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ నర్సింహులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు అందరూ పాల్గొన్నారు.



## ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు



**పులివెందుల, మార్చి 21 , ప్రభాత వార్త :**

పులివెందులలోని శిల్పరామం ప్రాంగణం శనివారం రంజాన్ పండుగ సందర్భంగా కళాకళలాడింది. ఈ సందర్భంగా పుష్పగిరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో భాగంగా చిన్నారులు వివిధ పాటలకు నృత్య ప్రదర్శనలు ఇచ్చి సందడి చేశారు. ముఖ్యంగా రఘుకుల తిలక, రంజాన్, పెద్దిరెడ్డి, కార్తీకదీపం, బాయ్స్ రీమిక్స్, భజన సాంగ్, మాస్ రాజా, ఉందిలే మంచి కాలం, చిలకపచ్చ కోక, స్వాతి రెడ్డి తదితర పాటలకు చేసిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి.ప్రేక్షకులు చిన్నారుల ప్రతిభకు ముగ్ధులై కరతాళ ధ్వనులతో అభినందించారు. మొత్తం ప్రాంగణం ఉత్సాహభరిత వాతావరణంతో సందడిగా మారింది.ఈ కార్యక్రమం ఏర్పాట్లను శిల్పరామం పరిపాలన అధికారి టి. విశ్వనాథ్ రెడ్డి పర్యవేక్షించారు, ఈ కార్యక్ర మంలో సూపర్వైజర్లు బి. సుబ్బారావు, ఎం. ఇస్మాయిల్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



## చిన్నారులకు ఉచితంగా సైకిళ్లు పంపణి



**వేంపల్లి :మార్చి 21 ప్రభాతవార్త**

రంజాన్ పండుగ సందర్భంగా శనివారం చిన్నారులకు ఉచితంగా సైకిళ్లు పంపిణి చేశారు..పవిత్ర మైన రంజాన్ మాసం లో పంచాయతీ పరిధి లో ఉన్న వై ఎస్ మదీనా పురం లో ఉన్న మొహమ్మదియా అహలే హదీస్ మసీద్ నందు ఆ ఇద్దరు చిన్నారులు రంజాన్ నెల అంత 5 పూటలా నమాజ్, అలాగే మసీద్ లో సేవలు అందించి నందుకు అయిషా సిద్ధిక మద్రాసా యాజమాన్యం ఆధ్యారం లో సైకిళ్లు పంపిణి చేశారు. మసీద్ పెద్దలు చేతుల మీదుగా పంపిణి చేశారు.

## ఘనంగా ఈదుల్ ఫితర్ ఉత్సవాలు

**పెద్దమండెం మార్చ్ 21 ప్రభాతవార్త**

మండలంలోని ముస్లిం సోదరులు శనివారం రంజాన్ పండుగసందర్భంగా ముస్లిం సోదరులు ఈదుల్ ఫితరును ఘనంగా జరుపుకున్నారు నెల రోజుల పాటు ఉపవాసాలు ఉండి ప్రత్యేక ప్రార్థనలు చేసి నెలవంక చూసిన అనంతరం ఈదుగాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు అనంతరం ఒకరికి ఒకరు ఆలింగన చేసుకొని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటారు ఈ పండుగ ముస్లిం సోదరులకు అతి ముఖ్యమైన పండుగ ఈ పండుగ రోజు ఉదయాన్నే లేచి స్నానాలు ఆచరించి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇది కాక వెళతారు అనంతరం పేదలకు వస్త్ర దానం ఆర్థిక సాయం అన్నదానం చేయడం ఈ పండుగ యొక్క ముఖ్య ఉద్దేశం ఈ పండుగలు అల్లా కోరిన కోరికలు తీర్చడం జరుగుతుంది. అందుకే ఈ పండుగను ముస్లిం సోదరులు ప్రత్యేక శ్రద్ధలతో జరుపుకోవడం జరుగుతుంది

